క్లుప్తంగా

ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు నిరుపమానం

ఆరిలోవ: ఆరిలోవ జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఆస్పత్రి)లో సోమవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ సిబ్బంది, వైద్యులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌యూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ వృత్తికి చేసిన సేవలు నిరుపమానమని కొనియాడారు. ఆమె చేసిన సేవలను గుర్తించుకోవడానికి అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవంగా జరుపుతున్నట్లు తెలిపారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో పి.ఆర్.సర్కార్ జయంతి



ఆశ్రమంలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు ప్రభాత రంజన్ సర్కార్ బాబా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ స్వామీజీ ఆచార్య సౌమ్యానంద్ అవదూత ఆధ్వర్యంలో భక్తులు, ఆశ్రమ సభ్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పి.ఆర్.సర్కార్ చిత్రపటం వద్ద పూజలు, ప్రార్థనలు చేశారు. చిన్నారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. భక్తులు సామూహిక ధ్యానం చేశారు. సాయంత్రం భజనలు, పాంచజన్య ధ్యానం నిర్వహించారు. అనంతరం పి.ఆర్.సర్కార్ సేవా కార్యక్రమాలు, ఆయన జీవిత చరిత్ర గురించి చిత్రం ప్రదర్శించారు. వేడుకల్లో ఆనంద్‌మార్గ్ ఆశ్రమ సభ్యులు త్రిలోకేశానంద అవదూత, స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి డీజీఎం ఎస్.పండ, ఆర్.ఎ.పాత్రో, ఎస్.వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌లో తొలగించిన పరికరాల ఏర్పాటు



పితాపురం కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన జిమ్, ఆట పరికరాలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పితాపురం కాలనీ పార్క్‌లో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి తొలగించిన ఆట వస్తువులు, జిమ్ పరికరాలను తిరిగి ఏర్పాటు చేశారు. స్థానికులు పెద్ద ఎత్తున నిరసన తెలపడంతోపాటు హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు తిరిగి వాటిని అదే స్థానంలో అమర్చారు.

ల్యాప్‌టాప్ చోరీ

ఎంవీపీకాలనీ: స్థానిక ఉషోదయ కూడలిలోని 99 హాస్టల్‌లో ల్యాప్‌టాప్ చోరీ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. 99 హాస్టల్ మొదటి అంతస్తులో అలగంగి కిషోర్‌కుమార్ స్నేహితుడితో కలిసి నివసిస్తున్నాడు. గత నెల 27వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో వేడి వాతావరణం కారణంగా గది తలుపులు తీసి నిద్రపోయారు. ఉదయం నిద్రలేచి చూడగా.. ల్యాప్‌టాప్ కనిపించలేదు. దీంతో ఇటీవల కిషోర్‌కుమార్ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గెడ్డల్లో పూడికతీత



ఎస్‌బీఐ ఏరియా గెడ్డలోని చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని గెడ్డల్లో పేరుకుపోయిన పూడికను సోమవారం పారిశుధ్య సిబ్బంది పొక్లెయిన్‌తో తొలగించారు. రజక వీధి, ఎస్‌బీఐ ఏరియా తదితర ప్రాంతాల్లోని గెడ్డల్లో చెత్త పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్‌కు ఫిర్యాదు చేయగా.. ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వేసవి శిబిరాలు.. సృజనకు వేదికలు



బాస్కెట్‌బాల్ సాధనలో చిన్నారి



బీచ్ రోడ్డులోని ఓ స్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో నృత్య సాధన చేస్తున్న చిన్నారులు

- చిన్నారుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్న సమ్మర్ క్యాంప్స్
- సృజనాత్మకతను వెలికితీస్తున్న శిక్షణ తరగతులు
- జ్ఞాన సముపార్జన, మానసిక వికాసానికి దోహదం
- ఒత్తిడి నుంచి ఉపశమనం.. ఉల్లాసం



ఏయూ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ సాధన చేస్తున్న చిన్నారులు



వేసవి శిబిరంలో చిత్రలేఖనం నేర్చుకుంటున్న చిన్నారులు



చిన్నారులు తీర్చిదిద్దిన చిత్రం

ఏయూక్యాంపస్: వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారుల సంతోషానికి అవధులు ఉండవు. నిత్యం పుస్తకాలతో గడిపే వీరికి కాస్త విరామం దొరుకుతుంది. పుస్తకాల నుంచి బయటకు వచ్చి తమకు నచ్చిన రంగంలో కొంత సాధన చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. అదే సమయంలో సాధారణ పుస్తకాల్లో నేర్చుకునే అంశాలకు భిన్నంగా సృజనకు పదునుపెట్టేలా పనిచేసే అవకాశం చిక్కుతుంది. నగరంలో ఏర్పాటైన పలు వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తూ, మానసిక వికాసానికి దోహదపడే విధంగా నిలుస్తున్నాయి. బీచ్ రోడ్డు, కిర్లంపూడి లేఅవుట్, ఏయూ గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి.

నీతి కథల బోధన..

చిన్నారులకు కథలంటే ఎంతో ఇష్టం. నేటి యాంత్రిక యుగంలో కథలు చెప్పే పరిస్థితి పిల్లలకు లభించడం లేదు. చిన్న కుటుంబాలుగా మారిపోవడంతో కథలు చెప్పే పెద్దలు లేరు. పుస్తకాల్లో కథలు చదివే అలవాటు చిన్నారులకు తక్కువగా ఉంటుంది. దీనిని భర్తీ చేసేలా నిత్యం ప్రత్యేకమైన కథలు చెబుతూ చిన్నారులను అలరిస్తున్నారు. వీటి వల్ల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సమయస్ఫూర్తితో వ్యవహరించే విధానాలు వంటివి అలవడటానికి అవకాశం కలుగుతోంది. రామాయణం, భాగవత కథలు, పద్యాలను సైతం వేసవి శిబిరాలలో నేర్పిస్తున్నారు. దీని వల్ల చిన్నారుల్లో పద సంపద పెరగడం, మన సంస్కృతులను తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

నృత్యం, సంగీతం, లలిత కళలు..

ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకమైన కళ దాగి ఉంటుంది. దీనిని గుర్తించి వెలికి తీయడం పెద్దల బాధ్యత. చిన్నారులకు నృత్యం, సంగీతం, లలిత కళలపై ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. వేసవి శిబిరాల్లో చిన్నారులను తమ మనసుకు నచ్చిన అంశంలో రాణించేలా ప్రోత్సహించాలి. విదేశాల్లో మన సంప్రదాయ కళలకు మంచి ఆదరణ, అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ రంగంలో నిష్ణాతులుగా నిలవడానికి, సొంతంగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి అపార అవకాశాలు ఉన్నాయి.

క్రీడల్లో రాణించేలా శిక్షణ..

చిన్నారుల శారీరక ఎదుగుదలకు, వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కొన్ని చోట్ల ప్రత్యేకంగా బాస్కెట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, స్విమ్మింగ్, షటిల్, టేబుల్ టెన్నిస్ వంటివి నేర్పుతున్నారు. వీటిపై ఆసక్తి గల వారు సాధన చేస్తున్నారు. క్రీడల వల్ల ఓటమిని పరిచయం చేసుకుంటూ.. విజయం దిశగా అడుగులు వేయడం, సమష్టిగా పనిచేయడం, బృందంలో పనిచేస్తూ నిర్ణయాలు తీసుకోవడం, నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందడానికి సైతం ఇవి ఉపయుక్తంగా నిలుస్తాయి.

యోగా సాధన..

నేడు పాఠశాలల్లో క్రీడా మైదానాలు కరువవుతున్నాయి. దీని ఫలితంగా చిన్నారులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పడుతోంది. దీనిని అధిగమించడానికి యోగా ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని చిన్నారుల్లో జ్ఞాపక శక్తిని, ఏకాగ్రతను పెంచే ఆసనాలు, ధ్యానం వంటి అంశాలపై యోగా నిపుణులు ప్రత్యక్షంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఇక్కడ నేర్చుకునే అంశాలను నిత్యం ఇంట్లో సాధన చేయడం వల్ల వారి శారీరక, మానసిక ఆరోగ్య సమతుల్యం ఏర్పరచడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి.



వేసవి శిక్షణ శిబిరంలో యోగా సాధన చేస్తున్న చిన్నారులు

ఇష్టంగా యోగా సాధన చేస్తున్నారు



చిన్నారులకు యోగాపై ఎంతో ఆసక్తి ఉంది. ఇష్టంగా వారు నేర్చుకుంటున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు ఏకాగ్రతను పెంచే ఆసనాలు నేర్పిస్తున్నాం. వీటిని నిత్యం వారు సాధన చేయడం వల్ల విద్యలో సైతం మెరుగైన ప్రతిభ చూపడానికి ఉపకరిస్తుంది. – యామిని, యోగా శిక్షకురాలు

రోజూ క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నాం



మాకు క్రికెట్ అంటే ఇష్టం. మామూలు రోజుల్లో తగినంత సమయం ఉండేది కాదు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో నిత్యం ఐదారు గంటలు క్రికెట్ ప్రాక్టీస్ చేయడానికి అవకాశం లభించింది. చదువుతోపాటు క్రికెట్‌కు కూడా సమయం కేటాయిస్తూ సమన్వయం చేసుకుంటున్నాం. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక్ష శిక్షణకు హాజరవుతూ మెళకువలను నేర్చుకుంటున్నాం. – పి.సాత్విక్, పి.రుత్విక్, ద్వారకానగర్

బాస్కెట్‌బాల్, చెస్‌లో శిక్షణ పొందుతున్నా..



ఉదయం వేళలో బాస్కెట్ బాల్ నేర్చుకుంటున్నాను. దీని వల్ల నాకు కొంత క్రమశిక్షణ అలవడుతోంది. రెండు గంటల సమయం మైదానంలో గడుపుతాను. తరువాత చెస్ శిక్షణకు సైతం వెళ్తున్నాను. వేసవి సెలవుల్లో పూర్తి సమయం వీటికి వెచ్చించే అవకాశం ఏర్పడింది. పేరెంట్స్ ఎంతో శ్రద్ధగా నన్ను ట్రైనింగ్ క్యాంప్‌కు తీసుకొస్తున్నారు. – జ్యోత్న ప్రణవి, ఈస్ట్ పాయింట్ కాలనీ

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేర్చుకుంటున్నా..



నాకు ఇష్టమైన డ్యాన్స్‌తోపాటు బాస్కెట్ బాల్ నేర్చుకుంటున్నాను. తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కళలు, క్రీడా రంగాల్లో ప్రతిభ చూపడానికి ప్రయత్నిస్తున్నాను. – కె.చైత్ర వర్షిణి, కిర్లంపూడి లేఅవుట్

ఘనంగా చిన పోలమాంబ తొలేళ్ల సంబరం

నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



నిజరూపంలో చిన పోలమాంబ

మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామదేవత చిన పోలమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. 8వ రోజు అమ్మవారి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీకృష్ణా సేవా సంఘం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి తాపం నుంచి ఉపశమనానికి చలివేంద్రాలు పెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామాలను మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో చూడచక్కగా అలంకరించారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక ప్రదర్శనలకు శివాజీపాలెం, పీతవానిపాలెం, డాక్టర్స్ కాలనీలో ప్రత్యేక స్టేజీలు ఏర్పాటు చేశారు. స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీటిని తిలకించారు.



భక్తులను ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న శ్రీకృష్ణ సేవా సంఘం ప్రతినిధులు



విద్యుద్దీపాలంకరణలో శివాజీపాలెం

నేడు ప్రధాన పండగ

ఉత్సవాల్లో ఆఖరి రోజు మంగళవారం చిన పోలమాంబ అమ్మవారి ప్రధాన పండగ జరగనుంది. భక్తులకు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీకృష్ణా సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దారపాలెంలోని ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు అందింది. చినగదిలి మండలం దారపాలెం సర్వే నంబర్ 15/12లో ప్రభుత్వానికి చెందిన 3.7 సెంట్ల విస్తీర్ణంలో గుడాల శ్రీనివాసరావు ఇల్లు నిర్మిస్తున్నట్లు స్థానికుడు డి.కోటేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని ఎస్ఎఫ్ఏ రికార్డును ట్యాంపరింగ్ చేసినట్లు తెలిపాడు. సబ్ రిజిస్ట్రార్, జీవీఎంసీ, ఎలక్ట్రికల్ అధికారులు శ్రీనివాసరావుకు సహకరించారని ఆరోపించాడు. ఆ నిర్మాణం కోసం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన ఇంటి ప్లాన్ రద్దు చేయాలని, ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌ను కోటేశ్వరరావు కోరారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే మార్గం

సీతంపేట: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, అసమానతల నిరోధానికి బౌద్ధమే ఏకైక మార్గమని భారతీయ బౌద్ధ మహాసభ(బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం 2,569వ బుద్ధ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, సామ్రాట్ అశోకుడి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ మనిషి కోరికలపై అదుపు ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని బుద్ధుడు బోధించినట్టు తెలిపారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అసమానతలకు పరిష్కారం పంచశీల మార్గమే సరైనదని అంబేడ్కర్ సూచించారని పేర్కొన్నారు.

జోడుగుళ్లపాలెం సమస్యలపై జెడ్సీ ఆరా



జోడుగుళ్లపాలెంలో జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు మత్స్యకార గ్రామం జోడుగుళ్లపాలెంలో సోమవారం జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యటించారు. అధికారులతో కలిసి ఆమె వీధుల్లో తిరిగారు. పారిశుధ్యం, కాలువలు, రోడ్లు, వీధి దీపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలతో ఆమె మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ యూజీడీ సక్రమంగా పనిచేయకపోవడం, సకాలంలో వీధి కుళాయిలు రాకపోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్త నిల్వ ఉండిపోవడం, కాలువల్లో పేరుకుపోయిన పూడిక, వీధిలైట్లు వెలగకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళలు జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జోనల్ కమిషనర్ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని వారిని ఆదేశించారు. వీధుల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని, నిత్యం తడి, పొడి చెత్త సేకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. యూజీడీ మ్యాన్‌హోల్స్‌లో అడ్డంకులు లేకుండా దృష్టిపెట్టాలని, వెలగని వీధి దీపాలు తొలగించి కొత్త బల్బులు అమర్చాలని ఆయా విభాగాల సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, ఏఈ వెంకటరావు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెత్తమయం.. తొలగింపు శూన్యం





22వ వార్డు మంగాపురం కాలనీలో రహదారులపై పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో చెత్త పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వార్డులోని మంగాపురం కాలనీ, పితాపురం కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్ల మీద చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయింది. ప్రతి రోజూ ఉదయం వచ్చి చెత్తను తరలించాల్సిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కులు, గృహాలను తొలగించటంతో జీవీఎంసీ అధికారులకు ఉన్న శ్రద్ధ.. రోడ్డు మీద పేరుకుపోతున్న చెత్తను తొలగించడంలో లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. చెత్త కుప్పల వల్ల నిత్యం ఇబ్బంది పడుతున్నామని, ఎప్పటికప్పుడు పరిసరాల్లోని వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

ఆచార్యా.. నీటి సంరక్షణ ఇలాగేనా!

- ఆంధ్రా యూనివర్సిటీలో తాగునీరు లీకేజీ
- పట్టించుకోని వర్సిటీ అధికారులు









ఏయూలోని క్యాంపస్ కాలేజీల భవనాల వద్ద లీకవుతున్న తాగునీరు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో తాగునీటిని వృథా చేస్తున్నారు. క్యాంపస్ కాలేజీలు, వసతి గృహ భవనాల వద్ద పైప్‌లైన్ల లీకేజీతో రోజంతా నీరు వృథాగా పోతోంది. భవనాలపై ఉన్న ట్యాంకులకు నీటిని ఎక్కించేందుకు మోటార్లు వేసి, అలానే గంటల తరబడి వదిలేస్తుండటంతో నీరంతా పొంగి గోడలు తడచి కిందకు పారుతోంది. తాగునీటి కొరత కారణంగానే క్యాంపస్ హాస్టళ్లలో ఉంటూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు పంపించేస్తున్నామని యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయి. క్యాంపస్‌లోని కాలేజీలు, వసతి గృహాల వద్ద ట్యాంకులన్నీ నీటితో పొంగి, కిందకు పోతున్నాయి. లీకేజీతో పైపుల్లో నీరు ఆకాశాన్ని అంటుతున్నట్లుగా పైకి పొంగుతోంది. సోమవారం ఏయూలో ఎక్కడ చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. వీటిని తమ సెల్‌ఫోన్లలో బంధించిన కొంతమంది విద్యార్థులు, వర్సిటీ అధికారులకు చూపించేందుకు ప్రయత్నించారు. అధికారులు మాత్రం విద్యార్థులను పట్టించుకోలేదు. స్టూడెంట్లను యూనివర్సిటీ నుంచి బయటకు పంపించేయడమే లక్ష్యమన్నట్లుగా నీటి కొరత ఉందని ఏయూ అధికారులు సాకులు చెబుతున్నారని విద్యార్థులు అంటున్నారు. ఏదేమైనా నీటి సంరక్షణలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని చెబుతున్నారు.

శోభాయమానంగా అన్నమయ్య జయంత్యుత్సవాలు



శోభాయాత్రలో పాల్గొన్న నగరవాసులు, నృత్యకారులు

ఏయూక్యాంపస్: తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సోమవారం బీచ్ రోడ్డులో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాళీమాత ఆలయం నుంచి అన్నమయ్య విగ్రహం వరకు యాత్ర సాగింది. సబ్‌మెరైన్ ఎదురుగా ఉన్న అన్నమాచార్య విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు, అన్నమయ్య సంకీర్తన గోష్ఠి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు.